## క్లుప్తంగా

### సర్పంచ్‌కు గిరిబాబు పరామర్శ



బవురువాకలో సత్యనారాయణను పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: బవురువాకలో సతీవియోగంతో బాధపడుతున్న సర్పంచ్ దొడ్డి సత్యనారాయణను వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు గురువారం పరామర్శించారు. సత్యనారాయణ భార్య గౌరి కల్యాణి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. ఆమె కుటుంబ సభ్యులకు గిరిబాబు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్న వయసులోనే ఆమె మరణించడం బాధాకరమని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, గౌరింపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యులు నందా చిన్నబ్బాయి, అమరాధి కాశి, నాయకులు శేశెట్టి కోదండ, రామిశెట్టి దొరబాబు, గెద్దం రమణ, బేతా అర్జున్ తదితరులు ఉన్నారు.

### పలువురికి తోట పరామర్శ



రాంబాబును పరామర్శిస్తున్న నరసింహం, శ్రీరాంజీ

గోకవరం: మండలంలోని పలు కుటుంబాలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తోట నరసింహం, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ గురువారం పరామర్శించారు. ఆపరేషన్ చేయించుకున్న గోకవరంలో దాసరి దొరాజీని, అనారోగ్యం పాలైన పార్టీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబును వారిళ్ల వద్ద పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. పార్టీ నాయకులు దాసరి చినబాబు, సుంకర రమణ, గుల్లా ఏడుకొండలు, సుంకర వీరబాబు, మడికి మైనరబాబు, సమ్మెట మోహన్ తదితరులు ఉన్నారు.

### యనమల సంఘీభావం



మురళీకృష్ణంరాజును కలిసిన కృష్ణుడు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజును తుని పార్టీ నేత యనమల కృష్ణుడు గురువారం కలిశారు. కేసు వివరాలను తెలుసుకుని సంఘీభావం తెలిపారు. 86 ఏళ్ల పెద్దాయనపై రాజకీయ కుట్రలతో అక్రమ కేసు పెట్టడం దారుణమన్నారు.

### సీఈఓ సందర్శన

కోటనందూరు: మండల పరిషత్ కార్యాలయాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు గురువారం సందర్శించారు. కార్యాలయ రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. సంక్షేమ పథకాల అమలుపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎంపీడీఓ వెంకటనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ జయరాం ఉన్నారు.

# నారున్నా.. నీరేదీ..?

- మెట్టలో కొనసా..గుతున్న ఖరీఫ్ నాట్లు
- పలు గ్రామాల్లో కరవైన సాగు నీరు
- మందకొడిగా పంట నమోదు ప్రక్రియ
- అరకొరగా యూరియా పంపిణీ



కుమ్మరిలోవలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

తుని రూరల్: మెట్ట ప్రాంతమైన తుని వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ వరినాట్లు కొనసాగుతున్నాయి. వర్షాలు సకాలంలో.. సమృద్ధిగా కురిస్తే ఆగస్టు నెల వచ్చేసరికి నాట్లు పూర్తి కావాల్సి ఉంది. వర్షాలు సరిగా కురవకపోవడం, లోటు వర్షపాతం నమోదు, పూర్తి స్థాయిలో సాగునీటి వసతులు లేకపోవడంతో మెట్ట ప్రాంతంలోని తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో వరినాట్లు నేటికీ పూర్తి కాలేదు. వర్షాధారంపై సాగయ్యే గ్రామాల్లో వరినాట్లు పడలేదు. మళ్లలో వరినారు ముదిరిపోతుండగా, భూములు బీడువారుతున్నాయి.

సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో 15,124 హెక్టార్లలో సాధారణ వరిసాగు జరగాల్సి ఉంది. ఇప్పటి వరకు 13,249 హెక్టార్లలో వరినాట్లు పడినట్టు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వి.కొత్తూరు, లోవ కొత్తూరు, రాజుపేట, కొత్త వెలంపేట తదితర గ్రామాల్లో సాగునీరు లేకపోవడం, వర్షాల్లేక చెరువుల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడంతో సెంటు భూమిలోనూ వరినాట్లు పడలేదు. కుమ్మరిలోవ, కొలిమేరు, డి.పోలవరం తదితర శివారు భూముల్లో ఇప్పుడిప్పుడే వరినాట్లు పడుతున్నాయి. దీంతో పంట నమోదు (ఈ–క్రాప్) ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఖరీఫ్‌లో సాగయ్యే వరి, పత్తి, ఇతర 11,667 హెక్టార్లలో పంటలకు పంట నమోదు పూర్తయింది. పంట రుణాల మంజూరు అరకొరగానే ఉన్నాయి.

**సాగునీటి పరిస్థితులిలా..**

తాండవ, పంపా, ఏలేరు రిజర్వాయర్లతో పాటు, పీబీసీ, పుష్కర కాలువల ద్వారా కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం, తొండంగి, తుని మండలాలకు సాగునీరు లభిస్తుంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఆయా రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేవు. ఆగస్టు మొదటి, రెండో వారాల్లో కురిసిన వర్షాలకు నీటి నిల్వలు పెరగడం, నీటిని విడుదల చేయడంతో మెట్టలో వరినాట్లు ఊపందుకున్నాయి. పూర్తిగా వర్షాధారంపై ఆధారపడే భూముల్లో అవసరమైనంత మేరకు నీటి నిల్వల్లేక నాట్లు పడలేదు. చెరువుల్లో సైతం పూర్తి స్థాయిలో నీటి నిల్వలు చేరలేదు. నాట్లకే నీరు లేకపోతే.. పంట చేతికి అందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో నారు ఉన్నా, నాట్లు వేయడంపై సందిగ్ధత కొనసాగుతోంది. మరోవైపు యూరియా, ఇతర ఎరువుల కొరతను చవిచూస్తున్న రైతులు సాగుపై వెనుకాడుతున్నారు.

**సబ్ డివిజన్ పరిధిలో సాధారణ సాగు, వరి నాట్లు వేసిన విస్తీర్ణం**

| మండలం | సాధారణ సాగు | ఖరీఫ్ నాట్ల విస్తీర్ణం | పంట నమోదు |
|---|---|---|---|
| తుని | 2,731 | 2,013 | 1,617 |
| తొండంగి | 5,193 | 5,140 | 4,144 |
| కోటనందూరు | 4,023 | 3,771 | 2,451 |
| రౌతులపూడి | 2,066 | 1,998 | 1,912 |
| శంఖవరం | 1,111 | 324 | 487 |

### నారు ముదిరిపోతోంది

వర్షాధారంపై వరిసాగు చేస్తుంటాం. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో అవసరమైన సాగునీరు అందుబాటులో లేదు. ఇప్పటికే వేసిన నారు ముదిరిపోతోంది. నీరులేక నాట్లు వేయలేదు. ఈ నెలాఖరు వరకు చూసి భారీ వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయంగా ఆరు తడితో సాగయ్యే కూరగాయలు, ఆకుకూరల పంటలు వేస్తాను.

– ఎస్.గంగునాయుడు, రైతు, కొత్తూరు

### రెండు రోజుల్లో యూరియా

రైతు అవసరాల మేరకు యూరియా సరఫరా చేస్తాం. 50 శాతం యూరియాను ఆర్‌ఎస్‌కేల్లో అందించాం. రెండు రోజుల్లో 500 టన్నుల యూరియా ఆర్‌ఎస్‌కేలకు చేరుతుంది. మోతాదుకు మించి యూరియా వేయడం వల్ల ప్రయోజనం ఉండదు. అవసరానికి అనుగుణంగా రైతులు వాడుకోవాలి. ఏఓల ద్వారా పంట రుణాల మంజూరుకు కృషి చేస్తున్నాం. పంట నమోదు ప్రక్రియ కొనసాగుతుంది.

– చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఏడీఏ, తుని



కొత్తూరులో నారు అందుబాటులో ఉన్నా.. నాట్లు పడని భూములు

### వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



పూడికతీతను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలో అంటురోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ కోరారు. స్థానిక 12వ వార్డులోని పలు ప్రాంతాల్లో గురువారం డ్రైనేజీల్లో పూడికతీత పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పూడికలు తొలగించే చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలంలో అంటు రోగాలు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సిరిపరపు రాజేష్, జామి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

### వేధిస్తున్న యూరియా కొరత

కోటనందూరు: కాకరాపల్లి గ్రోమోర్ సెంటర్‌కు యూరియా కోసం గురువారం రైతులు పోటెత్తారు. బస్తా యూరియా కోసం రోజంతా క్యూలో నిలబడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్ తెచ్చుకోవాలని రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ప్రైవేటు షాపులకు భారీగా యూరియాను అమ్మేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు దుకాణాల్లో రూ.400కు విక్రయిస్తున్నారన్నారు. యూరియా అక్రమంగా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## గురువుల ఉత్తమ సేవలకు పురస్కారాలు



వాకచర్ల వరలక్ష్మీకుమారి



పాలూరి స్వప్న

జగ్గంపేట: జగ్గంపేట అంబేడ్కర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న వాకచర్ల వరలక్ష్మీ కుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన కాకినాడలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆమె అవార్డు అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికైన వరలక్ష్మిని జగ్గంపేటకు చెందిన పలువురు ప్రముఖులు, నేతలు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

**జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా స్వప్న**

ప్రత్తిపాడు: మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా వాకపల్లి మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని పాలూరి స్వప్న ఎంపికయ్యారు. ఈమె తొలుత ప్రత్తిపాడు ఆర్‌సీఎం ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా 2006 జూన్ 12న బాధ్యతలు చేపట్టారు. ఈ పాఠశాలను గతేడాది జూన్‌లో మూసివేయడంతో ఈమెను వాకపల్లి పాఠశాలకు బదిలీ చేశారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా స్వప్న ఎంపికై నందుకు ఎంఈవోలు వి.రాజబాబు, వై.అచ్చిరాజు, యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు, ప్రతినిధులు రాపర్తి రామలింగేశ్వరుడు, ఎస్వీ సూర్యనారాయణ, సీఆర్పీలు రాంజీ, ఎన్ అప్పనమ్మ, బాషా, గంగారావు తదితరులు అభినందనలు తెలిపారు.

తుని రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు తుని మండలానికి చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. వి.కొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం డి.క్షేమాభాయి, రేఖవానిపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో ఎస్‌జీటీ కె.విజయలక్ష్మి, డి.పోలవరం ఎంపీపీ స్కూల్ ఎస్‌జీటీ పి.మల్లేశ్వరరావు ఎంపికైనట్టు ఎంఈఓ గీతాదేవి తెలిపారు.

కిర్లంపూడి: రాజుపాలెం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు వట్టూరి వీవీ సత్యనారాయణ, బూరుగుపూడి మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుడు కంకిపాటి ఆదినారాయణమూర్తి, కిర్లంపూడి ఎంపీపీ స్పెషల్ స్కూల్ ఉపాధ్యాయుడు వంక సూర్యనారాయణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

గోకవరం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హిందీ స్కూల్ అసిస్టెంట్ రొబ్బి కృష్ణవేణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఆమె రంపఎర్రంపాలెం, తంటికొండ, గొల్లగుంట స్కూళ్లలో పని చేశారు.

రౌతులపూడి: ఎ.మల్లవరం ఎంపీపీ పాఠశాలలో సెకండ్రీ గ్రేడ్ టీచర్ ఎర్రా శ్రీనివాస్, బలరామపురం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం గోడె ప్రసన్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఎంఈఓలు సతీష్, కొండబాబు అభినందనలు తెలిపారు.

## కార్మిక నేత కరకాని మృతి



కరకాని భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వీరాంజనేయులు తదితరులు

ఏలేశ్వరం: అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా నాయకుడు కరకాని సత్యనారాయణ(62) అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. పట్టణంలో ఆయన స్వగృహం వద్ద పలువురు నాయకులు గురువారం కరకాని భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కరకాని మృతి కార్మిక లోకానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు శ్రద్ధాంజలి ఘటించారు. క్వారీ కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు కుంచే అంజిబాబు, సతీష్, వెంకటేష్ తదితరులు నివాళులర్పించారు.

## సమాధుల కూల్చివేత తగదు



తునిలో శ్మశాన వాటికను పరిశీలిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

తుని: అభివృద్ధి పేరిట స్థానిక కొండవారిపేట శ్మశానవాటికలో సమాధులను కూల్చడం తగదని సీఐటీయూ పట్టణ కన్వీనర్ నక్కెళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. సమాధులు కూల్చుతున్న ప్రాంతాన్ని సంఘ ప్రతినిధులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, అభివృద్ధి పేరుతో సమాధులను కూల్చడమంటే ప్రజల మనోభావాలను కించపర్చడమేనన్నారు. చనిపోయిన వారిని పవిత్రంగా భావించే ఈ సమాజంలో మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. మున్సిపల్ అధికారులు ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. శ్మశానవాటిక భారీగా ఆక్రమణకు గురైందని, దానిని వెలికితీయాలని డిమాండ్ చేశారు.

### పేదలకు దుప్పట్ల పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలో పేదలకు గురువారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి జన్మదినం సందర్భంగా పేద మహిళలకు దుప్పట్లు అందజేశారు. అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన

గోకవరం: పేద ప్రజలకు ఆయుష్మాన్ భారత్ శ్రీరామరక్ష అని పలువురు వక్తలు అన్నారు. గోకవరం సచివాలయం–4 పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో ఆయుష్మాన్ భారత్ పథకంపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు మాట్లాడారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల్లో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ బొప్పన

తుని రూరల్: ప్రభుత్వాలు, పాలసీల్లో మార్పులు సహజమని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. గురువారం ఎస్.అన్నవరం కల్యాణ మండపంలో తుని మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పురోగతి సూచిక 1.0లో మార్పులు, 2.0లో ఏర్పాటు చేసిన నియమనిబంధనలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ కె.సాయినవీన్ అధ్యక్షత వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, పంచాయతీల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజలతో ఎన్నికై నప్పటికీ అధికారుల నుంచి సమాచారం, గౌరవం లభించడం లేదన్నారు. దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు నోటీసులు జారీ చేయడం అమానుషమన్నారు. అనర్హులుంటే తొలగించవచ్చని, అర్హులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ జి.మరిడియ్య, చిటికెల వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

### మేజిక్ డ్రైన్ నిర్మాణానికి ప్రణాళిక



గ్రామాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

జగ్గంపేట: నియోజకవర్గంలోని గోవిందపురం గ్రామంలో మేజిక్ డ్రెయిన్ నిర్మాణానికి జిల్లా అధికారుల బృందం గురువారం పరిశీలించింది. గోవిందపురం గ్రామాన్ని ఎంపిక చేసి ఇక్కడ పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేయనున్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్వేత, మరికొందరు అధికారులు గ్రామంలోని గిరిజన కాలనీలో దీన్ని చేపట్టాలని నిర్ణయించారు. మేజిక్ డ్రైన్ వల్ల గృహాల్లో వాడకం నీరు, వర్షపు నీరు మరలా భూమిలోకి ఇంకడం ద్వారా భూగర్భ జలాలు పెరగడానికి దోహద పడుతుందని శ్వేత తెలిపారు. గ్రామంలో 3 కిలోమీటర్ల పరిధిలో మేజిక్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్టు చెప్పారు.

## సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

ప్రత్తిపాడు: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ గొల్ల కాంతి సుధాకర్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0 పరివర్తన వ్యాప్తిపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎంపీపీ కాంతి సుధాకర్ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సమస్యలు, అవసరాలను గుర్తించి, అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, డిప్యూటీ ఎంపీడీఓ కాశీవిశ్వనాథం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరివర్త వ్యాప్తిపై వర్క్‌షాప్ నిర్వహించినట్టు ఎంపీడీఓ కె.చంద్రరావు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ ఐఎస్ శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# గణపతి బప్పా మోరియా

- ఘనంగా గణేశ్ విగ్రహాల నిమజ్జనాలు
- ఊరేగింపులో యువత, పిల్లల సందడి



ఏలేశ్వరంలో గణేశ్ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



పుష్కర కాలువ వద్ద విగ్రహ నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు



ఎస్.పైడిపాలలో గణేశ్ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న గ్రామస్తులు

రౌతులపూడి: వినాయక చవితి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని పలు గ్రామాల్లోని వినాయక విగ్రహాలను గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. మండలంలోని ఎస్.పైడిపాల, రౌతులపూడి, ములగపూడి, మెరక చామవరం, శృంగవరం, లచ్చిరెడ్డిపాలెం, ఎన్ఎన్ పట్నం, ఎస్.అగ్రహారం, పారుపాక, గిడజాం గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో బాణసంచా కాల్పులతోను, మంగళవాయిద్యాలు, తీన్మార్ డప్పులతో, భజనలతో స్వామివారిని గ్రామాల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఊరేగింపు సందర్భంగా ప్రజలంతా తిలకించేందుకు కోలాటం, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. నవరాత్ర మహోత్సవాలను సందర్భంగా మండలంలోని గుమ్మరేగుల రామాలయం వద్ద, బలరామపురం సచివాలయం వద్ద, ఎ.మల్లవరం ఆంజనేయస్వామి గుడి వద్ద, రౌతులపూడి సత్యదేవా కాలనీలో ఏర్పాటు చేసిన మంటపాల వద్ద భారీ అన్న సమారాధనలు జరిగాయి.



జగ్గంపేట జ్యోతుల కాలనీలో జరిగిన ఊరేగింపులో సందడి చేస్తున్న యువత, పిల్లలు

**కోలాహలంగా నిమజ్జనాలు**

జగ్గంపేట: జగ్గంపేట గ్రామంతో పాటు, మండలంలోను గణేశ్ నిమజ్జనాలు గురువారం కోలాహలంగా సాగాయి. నవరాత్రుల 9వ రోజునే చాలా చోట్ల వినాయక మండపాల నుంచి గణపతి విగ్రహాలను నిమజ్జనానికి పెద్దఎత్తున తరలించారు. మరో మూడు రోజుల్లో చంద్ర గ్రహణం ఉన్న కారణంగా నిమజ్జనాలు జోరందుకున్నాయి. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు స్థానిక పుష్కర కాలువ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయించారు. నిమజ్జన ప్రాంతాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా యువత, మహిళలు, పిల్లలు ఊరేగింపులో డ్యాన్సులతో సందడి చేశారు.



వీరవరంలో గణపతిని దర్శించుకుంటున్న నరసింహం, శ్రీరాంజీ

**ఘనంగా అన్న సమారాధనలు**

కిర్లంపూడి: నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని గురువారం మండలంలోని వినాయక మండపాల వద్ద భజనలు, అన్న సమారాధనలు ఘనంగా జరిగాయి. వీరవరంలోని మునసబు వీధిలో ఉన్న వినాయకుడిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తోట నరసింహం, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొని, భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. అనంతరం కమిటీ సభ్యులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. జగపతినగరంలో బాల వినాయక, రమణయ్యపేటలో వినాయకుని ఆలయాల వద్ద భారీ అన్న సమారాధనలు జరిగాయి. కొండయ్యపేటలో వరసిద్ది వినాయక ఆలయం వద్ద ఏకాహం నిర్వహించారు.

శంఖవరం: మండలంలోని గౌరంపేట, అచ్చంపేట గ్రామాల వినాయకుని మండపాల వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ మండపాన్ని మారేడు, నేరేడు తోరణాలతో అలంకరించారు. భజన కళాకారులు భజనలు చేశారు.

**ఏలేరు కాలువలో..**

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా గణేశ్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్దవీధి, లింగవరంకాలనీ, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల నుంచి విగ్రహాలను ఊరేగించారు. స్థానిక మెయిన్‌రోడ్, బాలాజీచౌక్, హనుమాన్ జంక్షన్, మార్కెట్‌వీధి, శివాలయం వీధి మీదుగా ఏలేరు కాలువలోని బ్రహ్మణ రేవు వద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు. చంద్రగ్రహణం కారణంగా గురు, శనివారాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని లింగంపర్తి, యర్రవరం తదితర గ్రామాల్లో నిమజ్జనాలు ఘనంగా జరిగాయి.

**నిమజ్జనాలపై డ్రోన్ నిఘా**

తుని: వినాయక నిమజ్జనాలు, మండపాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచామని పట్టణ సీఐ గీతారామకృష్ణ తెలిపారు. గురువారం పట్టణంలో జరిగిన గణేశ్ నిమజ్జనాలను డ్రోన్లతో పర్యవేక్షించామన్నారు. నిమజ్జనాల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. శోభాయాత్రల్లో యువత విద్యుత్ వైర్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ముగిసిన నవరాత్రులు**

గండేపల్లి: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహాన్ని వాహనాలపై పురవీధుల్లో ఊరేగించారు. సమీపంలోని పుష్కర, పోలవరం కాలువల్లో నిమజ్జనం చేశారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ పర్యవేక్షించారు.